క్లుప్తంగా

6న గడప గడపకు మన ప్రభుత్వం

వలేటివారిపాలెం: మండలంలోని అయ్యవారిపల్లిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ రఫీక్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొంటారన్నారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అదే రోజు సాయంత్రం 3.00 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

సీఎస్‌పురం: ఉద్యానవన పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ పీడీ కె.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని కోవిలంపాడు సమీపంలో సాగు చేసిన జామ పంటను బుధవారం ఆమె పరిశీలించారు. కందిలో మారుకా మచ్చల పురుగు నివారణకు తీసుకోవాలసిన చర్యల గురించి, వరిలో తెగుళ్ల నివారణకు వాడవలసిన మందుల గురించి వివరించారు.

మహిళా పోలీసులు బాధ్యతగా పనిచేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్సై రాజారావు

పొన్నలూరు: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన మహిళా పోలీసులు బాధ్యతగా పని చేయాలని ఎస్సై దాసరి రాజారావు సూచించారు. మండలంలోని విప్పగుంట సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి మహిళా పోలీస్ రికార్డులు పరిశీలించారు. మహిళా పోలీస్‌తో కలిసి గ్రామంలో పర్యటించి ఆమె విధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో దాత కోనంకి మాధవరావు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ దాసరి కోటేశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



దుస్తులు అందచేస్తున్న మిత్ర తల్లిదండ్రులు

గుడ్లూరు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఉన్న నాన్ భ విత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఐఈఆర్టీ శరత్ అధ్యక్షతన నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ రమేష్, వైద్యాధికారి మారుతీరావు, ఏపీఓ వినయ్, దివ్యాంగ చిన్నారులు లూయిస్ బ్రెయిలీకి నివాళులు అర్పించారు. ఆదిఆంధ్ర కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి పాల్గొన్నారు. అనంతరం భవిత కేంద్రంలో చదువుతు విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మిత్ర అనే దివ్యాంగుడి జ్ఞాపకార్థం తల్లిదండ్రులు 20 మంది దివ్యాంగులకు దుస్తులు, టిఫిన్ బాక్స్‌లు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి రీ సర్వే



రీ సర్వేను ప్రారంభిస్తున్న తహసీల్దార్, సర్పంచ్

పామూరు: భూ సమస్యల పరిష్కారానికి సమగ్ర భూ రీసర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బీఆర్ ఎల్‌వీ ప్రసాద్ అన్నారు. పామూరులో 5 డ్రోన్‌ల సహాయంతో నిర్వహించనున్న సమగ్ర భూరీ సర్వేను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేద్వారా భూ యజమానికి శాశ్వత హక్కుపత్రం కల్పిస్తామన్నారు. ఈఓఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ అల్లూరి రాగమ్మ, యాదాల వెంకట సాయికిరణ్, ఇర్రి క్రిష్టారెడ్డి, పాల్గొన్నారు.

బాబా స్థూపానికి విరాళం

కందుకూరు అర్బన్: కృష్ణాజిల్లా మచిలీపట్నం సమీపంలోని గుడూరు సద్గురు రామ్ రతన్‌జీ ఆశ్రమంలో నిర్మిస్తున్న 108 అడుగుల బాబా స్థూపానికి మన్నేటికోటకు చెందిన గడ్డం శ్రీనివాసరావు ధర్మపత్ని సబిత రూ.50,116 నగదును ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సమక్షంలో కమిటీ సభ్యులు దామా వెంకయ్యస్వామికి అందజేశారు. కొండూరి వసంతరావు, సూరం వేణుగోపాల్‌రెడ్డి, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి
- చాగల్లులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

ఉలవపాడు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చాగల్లులో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలని, ఎవరికైనా అందని పక్షంలో వాటిని గుర్తించి వారిని న్యాయం చేయాలని ఎమ్మెల్యేలను ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పంపుతున్నారని తెలిపారు. వారి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు అవసరమైతే వెంటనే చేయాలని రూ.20 లక్షల నిధులు కూడా ఒక్కో సచివాలయానికి కేటాయించినట్లు తెలిపారు. చాగల్లులోని ఇందిరానగర్ కాలనీ, అంబేద్కర్‌నగర్‌లలో ఆయన గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత ఆయా కుటుంబాలకు అందిన లబ్ధి గురించి వివరిస్తూ దానికి సంబంధించిన బ్రోచర్ అందించారు. చాగల్లులో మంజూరైన నివేశన స్థలాల పట్టాలను మహిళలకు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ గుడ్లు సంఖ్యలో తేడా ఉండడంతో గుర్తించారు. కార్యకర్త, ఆయా, సూపర్ వైజర్‌లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రాథమిక పాఠశాలలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. సచివాలయ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ సక్రమంగా పనిచేయడం లేదని తెలియచేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందిరానగర్ కాలనీలోమంచినీటి పైపులైన్ పూర్తిస్థాయిలో వేయాలని కోరారు. రామలక్ష్మి తనకు నేతన్న నేస్తం పడలేదని తెలిపారు. చెంచమ్మ చేయూత అందలేదని తెలిపారు. నంబూరి వెన్నెల ఆధార్‌కార్డు మార్పించాలని కోరారు. మొత్తం 590 కుటుంబాలను ఆయన సందర్శించి వారితో మాట్లాడారు. 28 మంది లబ్ధిదారులకు నివేశన స్థల పట్టాలు అందించారు.

సాయిచంద్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటా

ఇటీవల హైవే కూలీగా పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మెండా సాయి చంద్ కుటుంబసభ్యులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే మహీధరరెడ్డి వారి కుటుంబ సభ్యులకు తెలిపారు. హైవే వాళ్లతో మాట్లాడామని, వారి ద్వారా ఇన్సూరెన్స్ రూ.10 లక్షల వరకు వస్తుందని తెలిపారు. ప్రభుత్వం ద్వారా కూడా ఆర్థిక సాయం అందేలా కలెక్టర్‌తో మాట్లాడుతామని తెలిపారు. అసైన్‌మెంట్ ద్వారా ఆ కుటుంబానికి త్వరగా భూమి అందేలా చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ఎంపీపీ మస్తానమ్మ, జెడ్పీటీసీ అరుణ, మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, ఎంపీడీఓ చెంచమ్మ, తహసీల్దార్ మహ్మద్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యానికి రారాజు జగన్

- ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి
- ఉలవపాడులో నూతన పెన్షన్ల పంపిణీ...



పెన్షన్లు అందచేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి

ఉలవపాడు: సంక్షేమ రాజ్యానికి రారాజు జగన్ అని దేశమంతా కొనియాడుతుందని ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతన పెన్షన్ల పంపిణీలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు పెన్షన్లు తొలగించారని అబద్ధ ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఉలవపాడు మండలంలో 2019లో 7247 పెన్షన్లు ఉన్నాయని 2020కు 7708, 2021కు 8125, ప్రస్తుతం 2022–23కు 8458 పెన్షన్లు పెరిగాయని అన్నారు. ఈ లెక్కలు ప్రతిపక్ష నాయకులు కావాలంటే అందచేస్తామన్నారు. అనర్హులకు తొలగించి అర్హులు ఎంతమంది ఉన్నా వారికి అందించాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. నమ్మిన ప్రజలకు మేలు చేయాలని చూసే నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కేవలం అక్కసుతో ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారని ప్రజలు దీన్ని గుర్తించాలన్నారు. 2014 నుంచి 2019 వరకు ఎక్కడా భూ పంపిణీ చేయలేదని, ప్రస్తుతం జగన్ నిరుపేదలకు భూపంపిణీ చేయాలని ఈ నెల 10 నుంచి దరఖాస్తులు చేసుకోవాలని చెప్పినట్లు తెలిపారు. వైఎస్సార్ గతంలో 4 సార్లు భూ పంపిణీ చేశారని, ఆయన వారసుడుగా జగన్ పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో కూడా సంక్షేమ పథకాలన్నింటినీ అందజేశారన్నారు. అనంతరం 295 మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వాయల మస్తానమ్మ, జెడ్పీటీసీ అరుణ, మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, వైస్ ఎంపీపీలు సయ్యద్ ఫజుల్, దాసరి రమణయ్య, ఎంపీడీఓ చెంచమ్మ, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

కందుకూరు: జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడాకారులను ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య బుధవారం ఘనంగా సన్మానించారు. కాలేజీ హాకీ గోల్ కీపర్ పి.నందిని, టార్గెట్‌బాల్ 8వ సబ్ జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో రజిత పతకం సాధించిన క్రీడాకారులు జి.రవిచంద్ర, కె.అశోక్‌లను ఘనంగా సన్మానించారు. క్రీడాకారులను ప్రోత్సహించి ఆర్థిక సాయం అందిస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని, జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతలు తీసుకొస్తారని చెప్పారు. ప్రిన్సిపాల్ రవికుమార్, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్, టీఆర్ ఆర్ జూనియర్ కాలేజీ పీడీ టి సుబ్బారావు, టార్గెట్‌బాల్ కోచ్ యం కామరాజు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



కండువాలు కప్పి పార్టీలో చేర్చుకుంటున్న హుస్సేన్‌రెడ్డి

పామూరు: మండలంలోని పడమటి కట్టకిందపల్లె బీసీ కాలనీకి చెందిన 12 కుటుంబాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ బూత్‌కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయభాస్కర్‌రెడ్డి, చల్లా శివయ్యల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈసందర్భంగా స్థానిక వైఎస్సార్‌భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరుతున్న చప్పలి బాలయ్య, చప్పలి గురుబాబులతోపాటు పలువురికి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి పార్టీలో చేరినట్లు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తి వంచనలేకుండా పనిచేస్తామన్నారు.

రాష్ట్రానికి పట్టిన ఖర్మ చంద్రబాబు



కొండపిలో వృద్ధులకు పింఛన్లు అందిస్తున్న వరికూటి అశోక్‌బాబు

కొండపి/మర్రిపూడి: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజలకు ఖర్మలా దాపురించారని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ధ్వజమెత్తారు. కొండపి ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి నూతనంగా మంజూరైన వైఎస్సార్ పింఛను కానుక పత్రాలు పంపిణీ చేశారు. అలాగే మర్రిపూడి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డితో కలిసి 135 మందికి పింఛను కానుక పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అశోక్‌బాబు మాట్లాడుతూ.. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సీఎం జగనన్న పాలనలో అవ్వాతాతలు హాయిగా ఇంటి వద్దనే ప్రతి నెలా వలంటీర్ల ద్వారా పింఛన్ అందుకుంటూ సంతోషంగా ఉన్నార న్నారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.2,750 పింఛను ఈ ప్రభుత్వంలోనే రూ.3 వేలు అవుతుందని తెలిపారు. గత టీడీపీ పాలనలో పచ్చ చొక్కాలకే పథకాలు కట్టబెట్టి కోట్లాది రూపాయల ప్రజాధనం లూటీ చేశారని విమర్శించారు. సీయం జగనన్న పాలనలో అవినీతి రహిత సంక్షేమం, అభివృద్ధి చూసి చంద్రబాబు ఓర్వలేక పనిగట్టుకుని ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారన్నారు. పేదలను ఇంకా పేదలుగా ఉంచడానికి కుట్రలు పన్నుతున్న చంద్రబాబును చూసి ప్రజలు ఇదేం ఖర్మరా బాబూ రాష్ట్రానికి అని నవ్వుకుంటున్నారన్నారు. టీడీపీ పాలనలో కొండపి నియోజకవర్గంలో జరిగిన అవినీతి, జన్మభూమి కమిటీల తీరుపై ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబును శాశ్వతంగా ఇంటికి పంపడం ఖాయమన్నారు. కందుకూరు సభలో 8 మందిని, గుంటూరు సభలో మరో ముగ్గురిని బలితీసుకున్న ఘనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడుకు ఓటేస్తే మన భవిష్యత్ మనం నాశనం చేసుకున్నట్లేనన్నారు. మీ పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవాలన్నా, గ్రామీణ ప్రాంత రైతులు అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

కొండపిలో వైస్ ఎంపీపీలు వేముల వెంకటప్రసాద్, రావులపల్లి కోటరాజు, ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గోగినేని వెంకటేశ్వరరావు, కోఆప్షన్ మెంబర్ ఎస్‌కే బాబూరావు, ఎంపీటీసీ బొల్లా సుబ్బారావు, సర్పంచ్‌లు మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భువనగిరి సత్యన్నారాయణ, ఎస్.ఒన్నూరు, ఆళ్ల సుజాత, మర్రిపూడిలో.. ఎంపీడీఓ ఎస్.సుదీప, ఈఓఆర్డీ ఎస్‌కే ఖాశింపీరా, సర్పంచ్ కదిరి భాస్కర్, బీవీ భాస్కర్‌రెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, కొండ్రు ఇజ్రాయిల్, కొమరా రమణయ్య, ఎంపీటీసీలు, పలువురు సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు నూతన పింఛన్లు పంపిణీ

పొన్నలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు కొండపి వైఎస్సార్‌సీపీ ఇంచార్జి వరికూటి అశోక్‌బాబు చేతుల మీదుగా నూతన పింఛన్లు అందజేస్తున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు తెలిపారు. లబ్ధిదారులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని బుధవారం ఓ ప్రకటనలో కోరారు.



బొట్లగూడూరులో పెన్షన్‌లు పంపిణీచేస్తున్న ప్రజాప్రతినిధులు

పామూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక అవ్వాతాతలకు ఆర్థిక భరోసా ఇస్తోందని ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చిప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొట్లగూడూరు, కంబాలదిన్నె, తూర్పుకట్టకిందపల్లె సచివాలయాల పరిధిలో నూతనంగా పెన్షన్ మంజూరైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ పువ్వాడి వెంకట సుజాత, ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, రవీంద్ర, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ మహిళాధ్యక్షురాలు జమీలా తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



శిక్షణలో మాట్లాడుతున్న ఆత్మ పీడీ అన్నపూర్ణ

సీఎస్‌పురం: పంటల సాగులో సేంద్రియ ఎరువులు వాడడం వల్ల ఖర్చు తగ్గటమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మ పీడీ కె.అన్నపూర్ణ అన్నారు. ఆత్మ ఆధ్వర్యంలో స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు శిక్షణ నిర్వహించారు. ఎరువులు, పురుగుమందులు ఎక్కువగా వాడటం వల్ల ఖర్చు పెరిగి దిగుబడి తగ్గి నాణ్యత లేని ఉత్పత్తులను పొందాల్సి వస్తుందన్నారు. రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమిలోని పోషక విలువలు తగ్గిపోయి పంటల సరిగా పండవని చెప్పారు. దీని నివారణకు సేంద్రీయ, జీవన ఎరువుల వాడకాన్ని, పచ్చిరొట్ట పైర్లు పెంపకాన్ని అలవాటు చేసుకోవాలని తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్యం అవశ్యకత, పచ్చిరొట్ట ఎరువుల వాడకం, సేంద్రియ వ్యర్థ పదార్థాలు, పశువుల పేడ ఉపయోగించి సిమెంటు రింగుల్లో వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. దర్శి వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఎల్ రాజేష్‌చౌదరి మాట్లాడుతూ పంటకు అవసరమైన మోతాదులో మందులు, ఎరువుల వాడాలన్నారు. తెగుళ్ల నివారణకు విత్తనశుద్ధి చేయాలని, పంట మార్పిడి చేయాలని, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పాలకొల్లు వెంకటేశ్వరరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వాడా లక్ష్మిరెడ్డి, వ్యవసాయశాఖ ఏడీఏ ఈవీ రమణ, ఏఓ కె.రాధ, జిల్లా వనరుల కేంద్రం ఏఓలు శైలజారాణి, వి.శేషమ్మ, రైతు వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఉల్లిగడ్డ కషాయంతో తామర పురుగు నివారణ

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయాధికారులు మిరప పంటలో వచ్చే తెగుళ్ల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా మిరప పంటలో వచ్చే తామర పురుగు నివారణకు ఉల్లిగడ్డ కషాయం తయారు చేశారు. కషాయాన్ని మిరప పంటపై పిచికారీ చేస్తే తామర పురుగుతోపాటు ఆకు ముడతను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రకృతి సేద్యం వల్ల పెట్టుబడి తగ్గడంతోపాటు అధిక దిగుబడి పొందవచ్చని చెప్పారు. అనంతరం ఎం.నిడమనూరు గ్రామంలో పర్యటించి శనగ రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి వెంకట్రావు, ఎల్–2 విజయలక్ష్మి, ఐసీఆర్పీలు శృతి, సుజాత పాల్గొన్నారు.

పొగాకు రైతులకు రూ.10 వేల వడ్డీలేని రుణం

కందుకూరు: తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల పంట దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు పొగాకు బోర్డు రైతు సంక్షేమ నిధి నుంచి ప్రతి రైతుకు రూ.10వేల వడ్డీ లేని రుణం మంజూరు చేస్తున్నట్లు రెండవ పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. పంట దెబ్బతిన్న రైతులకు తిరిగి పంట వేసుకునేందుకు పెట్టుబడి సాయం కింద ఈ రుణం ఇస్తున్నామన్నారు. 2023 సీజన్‌లో జరిగే పొగాకు అమ్మకాల ద్వారా ఈ రుణాన్ని తిరిగి చెల్లించేలా రైతులకు వెసుబాటు కల్పించామన్నారు. రుణం అవసరమైన రైతులు తమ పరిధిలోని సూపర్‌వైజర్‌ని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

బాధ్యతగా పనిచేయండి



మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

కనిగిరి రూరల్: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేయాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వలంటీర్లు వారి 50–70 గృహాలకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికలు తయారు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులు, పింఛన్‌దారుల సమస్యలను సాధ్యమైనంత పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బందికి అర్థం కాని సమస్యలుంటే తక్షణ చర్చించాలన్నారు. ప్రతి వలంటీర్ మూడు రోజులు సోమ, బుధ, శుక్రవారాల్లో సచివాలయానికి హాజరై సమస్యలపై చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు.

పొలాలు పరిశీలించిన సబ్ కలెక్టర్



శామీరపాలెంలో పొలాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

వలేటివారిపాలెం: జగనన్న శాశ్వత భూ హక్కు కార్యక్రమంలో భాగంగా మండలంలోని నలదలపూరు, శామీరపాలెం, పోలినేని పాలెం గ్రామాలు ఎంపిక చేసినట్లు తహసీల్దార్ సుందరమ్మ తెలిపారు. మండలంలోని నలదలపూరులో బుధవారం రైతులకు భూముల రీ సర్వే గురించి వివరించారు. భూములు కలిగిన రైతులంతా మీకు కేటాయించిన తేదీల్లో భూ హక్కు ఆధారాలతో ఉండాలన్నారు. సర్వేలో భాగంగా సబ్ కలెక్టర్ శోభిక శామీరపాలెం పొలాలను పరిశీలించారు. డిప్యూటీ సర్వేయర్ ప్రభాకర్, డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్, మండల సర్వేయర్ శ్రీలక్ష్మి, ఆర్ఐ నరసయ్య, వీఆర్‌ఓ మల్లేశ్వరి ఉన్నారు.

దెబ్బతిన్న పొగాకు తోటలకు నష్టపరిహారం



పొగాకు తోటలను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

టంగుటూరు: మాండూస్ తుఫాను వల్ల దెబ్బతిన్న పొగాకు తోటలకు నష్టపరిహారం అందిస్తున్నామని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలు పొగాకు బోర్డు ప్రాంతీయ కార్యాలయం, టంగుటూరు పొగాకు బోర్డు వేలం కేంద్రం ఆధ్వర్యంలో పొగాకు కంపెనీల ప్రతినిధులతో కూడిన బృందం బుధవారం కె.ఉప్పలపాడు, ఎం.నిడమానూరు, పొందూరు, గొర్లమిట్ట, మట్టిపాడు, మల్లవరపుపాడు, శివపురం తదితర గ్రామాల్లో పొగాకు తోటలను పరిశీలించింది. ఈ సందర్భంగా పొగాకు రైతుల సమస్యలను తెలుసుకున్న అధికారులు.. తగిన సలహాలు, సూచనలు అందించారు. పంట నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సహాయం కింద రైతు సంక్షేమ నిధి నుంచి రూ.10 వేలు అందించాలని బోర్డు నిర్ణయించిందని పేర్కొన్నారు. బోర్డులో అర్జీలు అందజేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్జీఓలు సునీల్‌కుమార్, తులసి, క్షేత్రాధికారి వెంకట్రావు, ప్రసాద్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

8 నుంచి క్రికెట్ పోటీలు

సీఎస్‌పురం: సంక్రాంతిని పురస్కరించుకొని కోవిలంపాడు యూత్ ఫోర్సు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సీఎస్‌పురం, పామూరు మండలాల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.30,116, రూ.20,116 అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 7వ తేదీ మధ్యాహ్నం లోగా రూ.500 ప్రవేశం రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9347427623, 8125906539 నంబర్లను సంప్రదించాలని కోరారు.

డ్రైనేజీ కాలువలు ఆక్రమిస్తే చర్యలు

కనిగిరి రూరల్: డ్రైనేజీ కాలువలు ఆక్రమించినా, అక్రమ కట్టడాలు నిర్మించినా శాఖపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ ఛైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలో పదో వార్డు పాతూరులో బుధవారం ఛైర్మన్ గఫార్, కౌన్సిలర్ దాసరి మురళిలు పర్యటించారు. మసీద్ వెనుక వైపు నుంచి సుదర్శన్ మహల్ వరకు వెళ్లే ప్రధాన కాలువ ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఆక్రమణదారులు ఎవరైనా ఉపేక్షించవద్దని, కాలువను పూర్తి స్థాయిలో పునః నిర్మాణానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ చెన్న కేశవులును ఆదేశించారు. శానిటరీ సెక్రటరీ నాగలక్ష్మి, మురళీకృష్ణ, కన్వీనర్ ఎస్ఎస్ రసూల్ పాల్గొన్నారు.



వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్